సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం, 8, ఫిబ్రవరి, 2025



అతివలకు ఆదరువుగా..

మున్సిపాలిటీల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఇస్తున్న రుణాలతో మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారు. 8లో



మావోయిస్టులు అరెస్ట్

మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యుడితోపాటు ముగ్గురు మిలీషియా సభ్యులను చర్ల పోలీసులు అరెస్టు చేశారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
36° / 20°

జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా జలాధివాసం



నీళ్ల బిందెలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో పుష్కర మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా శుక్రవారం గణపతిపూజ, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠ తదితర పూజలు వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు పసుపు బట్టలతో నీళ్లబిందెలతో ఉరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రదక్షిణ చేశారు. అనంతరం శివాలయం ప్రతిష్ఠామూర్తులకు జలాధివాసం చేశారు. ఈఓ రజనీకుమారి పాల్గొన్నారు.

నేల విడిచి సాము !



కొత్త గనుల ప్రారంభం, కార్మిక సంక్షేమంపై ముందుగా దృష్టి సారించి ఆ తర్వాత ఇతర రంగాల్లో విస్తరించే అంశంపై సింగరేణి దృష్టి పెట్టాలనే డిమాండ్లు నలువైపులా పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ అంశంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గళం విప్పగా, గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కూడా జత కలిసింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- కొత్త ప్రాజెక్టులంటూ సింగరేణి వరుస ప్రకటనలు
- ఏళ్లు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో కనిపించని పురోగతి
- నూతన బొగ్గు గనుల ఏర్పాటులోనూ అదే తంతు
- కార్మిక సంక్షేమం విస్మరించిందంటూ గుర్తింపు సంఘం ఆరోపణలు

తడబడుతున్న అడుగులు

వందేళ్లకుపైగా కేవలం బొగ్గు ఉత్పత్తికే ఎక్కువగా పరిమితమైన సింగరేణి ఇప్పుడు బహుముఖంగా విస్తరిస్తోంది. అందులో భాగంగా 1,200 మెగావాట్ల సామర్థ్యంతో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌టీపీపీ) మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 2016 ప్రారంభమైంది. అనతి కాలంలోనే థర్మల్ విద్యుత్ ఉత్పత్తితో అనేక రికార్డులు ఎస్‌టీపీపీ సొంతమయ్యాయి. దీంతో మరిన్ని రంగాల్లో విస్తరించే లక్ష్యంతో 2018లో తొలిసారిగా రామగుండం 3 ఏరియాలో సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి ప్రారంభించింది. ఈ ఏడాది చివరి నాటికి 11 ఏరియాల పరిధిలో 520 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి సాధించనుంది. రామగుండంలోనే ఫ్లోటింగ్ సోలార్ యూనిట్ తీసుకొచ్చింది. ఆ తర్వాత మందమర్రిలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఏకకాలంలో అనేక రంగాలపై దృష్టి సారించడంతో కార్యనిర్వహణ కష్టమై సంస్థ అడుగులు ఇప్పుడు తడబడుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

ప్రకటనలతోనే సరి!

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్(జైపూర్) ప్రాంగణంలో 800 మెగావాట్ల సామర్థ్యంతో కొత్త ప్లాంట్ నిర్మిస్తామని రెండేళ్లుగా చెబుతున్నా ఇంత వరకు క్షేత్రస్థాయిలో పనులు మొదలు కాలేదు. అసలు ప్రారంభమే కానీ నైనీ బ్లాక్‌లో 1,200 మెగావాట్ల సామర్థ్యంతో పిట్ హెడ్ థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణాన్ని తలకెత్తుకుంది. మరోవైపు రామగుండంలో టీజీ జెన్‌కో స్థలంలో 1,600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి సై అనడం సింగరేణికి చేటు తెచ్చింది. జెన్‌కో ఉద్యోగులు కారాలు మిరియాలు నూరడంతో సింగరేణి వెనక్కి తగ్గాల్సి వచ్చింది.

సంక్షేమంపై దృష్టి సారించాలని..

ఇప్పటికే అనుభవం ఉన్న బొగ్గు తవ్వకం, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి, సోలార్ పవర్ రంగాల్లోనే ఆశించిన వేగంతో పనులు ముందుకు సాగడం లేదు. అయినప్పటికీ విస్తరణ విషయంలో సింగరేణి యాజమాన్యం వెనక్కి తగ్గడం లేదు. గడిచిన రెండేళ్లుగా ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్, పంప్డ్ హైడ్రో పవర్ ప్లాంట్, జియో థర్మల్ పవర్ ప్లాంట్, విండ్ పవర్, రాజస్థాన్‌లో సోలార్ పవర్ ప్లాంట్లు అంటూ సరికొత్త ప్రణాళికలు తెర మీదకు తెస్తోంది. చివరకు లిథియం మైనింగ్‌కు సిద్ధమేనంటూ యాజమాన్యం చెబుతోంది. ఇప్పటికే మేనేజ్‌మెంట్‌పై గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ విమర్శలు చేస్తోంది. విస్తరణ పేరుతో హడావుడి తగ్గించి కార్మిక సంక్షేమంపై దృష్టి సారించాలని కోరుతోంది.

కొత్త గనులేవి ?

గడిచిన మూడేళ్లుగా గోలేటి, రొంపేడు, వీకే మెగా ఓసీ, నైనీ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తామని సింగరేణి చెబుతోంది. సంస్థ వార్షిక ప్రణాళికలో కూడా నైనీ పేరును ప్రస్తావిస్తున్నారు. రెండు ఆర్థిక సంవత్సరాలు గడిచినా ఇంతవరకు నైనీలో పనులు మొదలు కాలేదు. గతేడాది ఆగస్టులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎండీ బలరాంనాయక్ ఒడిశా సర్కారుతో చర్చలు జరిపారు. నైనీ గని కోసం అవసరమైన అటవీ భూమిని సాధ్యమైనంత త్వరగా సేకరించి ఇస్తామని చెప్పారు. ఆర్నేళ్లు గడిచినా ఇంకా నైనీ గని ప్రారంభించే చోట చెట్ల తొలగింపు ప్రక్రియనే మొదలు కాలేదు. సంస్థ మేనేజ్‌మెంట్, స్టేట్ గవర్నమెంట్ ఉండే తెలంగాణలోనూ ఒక్క గనిని ప్రారంభించలేకపోయింది. మరోవైపు కొత్త గనుల వేలం పాటపై సింగరేణి సంస్థ అవలంబిస్తున్న దోబూచులాట కారణంగా గడిచిన పదేళ్లుగా కొత్త గనులు దక్కడం లేదు.

పుష్కర కాలానికి..

- భద్రాచలంలో స్థానిక సంస్థల ఎన్నికలు..
- మిగతా పంచాయతీ, పరిషత్‌లతోపాటే ఇక్కడా ఎలక్షన్
- 20వార్డుల్లో ఓటర్లు, పోలింగ్ బూత్‌ల జాబితా సిద్ధం
- 14 ఎంపీటీసీ స్థానాలతో మండల పరిషత్ ఎన్నికలు



భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయం

భద్రాచలం: భద్రాచలంలో పుష్కర కాలం తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. మున్సిపాలిటీ ఏర్పాటు, మూడు పంచాయతీలుగా విభజన వంటి సందిగ్ధ పరిస్థితికి చెక్ పెడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పంచాయతీగా కొనసాగించాలనే నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో అన్ని పంచాయతీలతోపాటు భద్రాచలానికి కూడా ఎన్నికలు నిర్వహించేందుకు సమాయత్తమవుతోంది. రద్దయిన భద్రాచలం మండల పరిషత్‌ను మళ్లీ ఏర్పాటు చేయడంతో పరిషత్ ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు. దీంతో భద్రాచలంలో 12 ఏళ్ల తర్వాత స్థానిక ఎన్నికల సందడి నెలకొంది.

40 పోలింగ్ బూత్‌లు.. 20 వార్డులు

భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీకి చివరిసారిగా 2013లో ఎన్నికలు జరగ్గా, పాలకవర్గ పదవీ కాలం 2018లో ముగిసింది. తెలంగాణ ఆవిర్భావించాక ప్రభుత్వం భద్రాచలం, సారపాకను మున్సిపాలిటీలుగా ప్రకటించింది. దీన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ నేతలు హైకోర్టును ఆశ్రయించగా పురపాలక ఏర్పాటుకు బ్రేక్ పడింది. వెనక్కు తగ్గిన ప్రభుత్వం భద్రాచలాన్ని మూడు గ్రామపంచాయతీలు, సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. దీనిపైనా స్థానికంగా వ్యతిరేకత వచ్చింది. ఇప్పటికే రాష్ట్ర విభజనతో తీవ్రంగా నష్టపోయిన భద్రాచలానికి ఇది మరింత నష్టం కల్గిస్తుందని రాజకీయ పార్టీలు సైతం ఆక్షేపించాయి. అనంతర పరిణామాల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలాన్ని తిరిగి మేజర్ గ్రామపంచాయతీగా ప్రకటించింది. దీంతో 12 ఏళ్ల తర్వాత గ్రామపంచాయతీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఓటరు జాబితా సిద్ధం చేశారు. భద్రాచలాన్ని 20 వార్డులుగా విభజించి సుమారు 40 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత బుధవారం గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం జరిపారు. ఎన్నికల నిర్వహణపై సలహాలు, సూచనలను స్వీకరించి మార్గదర్శకాలను వివరించారు.

లక్ష మంది జనాభా ఉన్నా..

జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీలుగా ఉన్నాయి. తాజాగా అశ్వారావుపేటను కూడా మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో భద్రాచలం మినహా అన్ని మేజర్ పట్టణాలు మున్సిపాలిటీలుగా మారాయి. సుమారు లక్ష మంది జనాభా ఉండే భద్రాచలాన్ని గతంలో టౌన్‌షిప్‌గా, కొంత కాలం మున్సిపాలిటీగా సైతం కొనసాగించారు. మున్సిపాలిటీ ఏర్పాటు గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా ఉండటంతో తిరిగి పంచాయతీగా కొనసాగించేందుకు నిర్ణయించారు. దీంతో నియోజకవర్గ కేంద్రమైనప్పటికీ భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీగా ఎన్నికలు జరగన్నాయి. జిల్లాలో కొత్తగూడెం మినహా ఇతర నియోజవకర్గ కేంద్రాల్లో కంటే భద్రాచలంలోనే అధిక జనాభా ఉంది. అయినా మేజర్ గ్రామపంచాయతీగా కొనసాగడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

14 ఎంపీటీసీలు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం కేంద్రం మినహా ఇతర గ్రామపంచాయతీలను ఏపీలో విలీనం చేశారు. దీంతో మండల పరిషత్‌ను అప్పట్లో కొత్తగా ఏర్పడిన ఆళ్లపల్లి మండలానికి తరలించారు. ఉద్యోగులను పలు చోట్ల సర్దుబాటు చేశారు. మండల పరిషత్‌ను తిరిగి ప్రకటించటంతో ఎంపీడీఓగా నారాయణను నియమించారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో భాగంగా మండల పరిషత్‌కు సైతం ఎన్నికలను జరపాలని భావిస్తుండటంతో అధికారులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. గతంలో మండల పరిషత్‌లో 13 ఎంపీటీసీలు ఉండగా ప్రస్తుతం వాటిని 14 స్థానాలకు పెంచారు. ఎన్నికల బూత్‌లు, జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఎన్నో ఏళ్ల తర్వాత భద్రాచలంలో గ్రామపంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల సందడి చోటు చేసుకోనుంది.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

బూర్గంపాడు/భద్రాచలం అర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రి, పీహెచ్‌సీలలో సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని, బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఐటీడీఏ పీఓ రాహుల్ వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మోరంపల్లిబంజర పీహెచ్‌సీ, భద్రాచలం ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల పరిసరాలను, రికార్డులను, మందులను పరిశీలించారు. ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్, ఓపీ, మెటర్నిటీ వార్డు, ఆరోగ్యశ్రీ వార్డులను సందర్శించారు. చికిత్స కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడి వారికి వైద్య సేవలు అందుతున్న తీరు గురించి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. రోగ నిర్ధారణ కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు పంపొద్దని ఆదేశించారు. మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి నిరుపేదలు వస్తుంటారని, ప్రత్యేక శ్రద్ధతో వారికి వైద్యం అందించాలన్నారు. సాధ్యమైనంతవరకు గర్భిణులకు సిజేరియన్ చేయొద్దని, సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. సిబ్బంది రోగుల నుంచి డబ్బులు ఆశించకూడదని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని చెప్పారు. ఓపీ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని, మందుల కొనుగోలుకు రోగులను ప్రైవేట్ మెడికల్ షాపులకు పంపొద్దని ఆదేశించారు. ప్రైవేటు ల్యాబ్‌ల్లో వివిధ పరీక్షలకు ఒకే ధర ఉండేలా చూడాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య, వైద్యాధికారులు రామకృష్ణ, సంతోష్ కుమార్, సాహితి, మధుబాల, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డయాలసిస్ సెంటర్‌లో బాధితుడితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్

ఈవీఎం గోదాం తనిఖీ



ఈవీఎం గోదాం వద్ద కలెక్టర్ జితేష్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రతి నెలా గోదాం తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. గోడౌన్ పరిసర ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేకుండా ఎవరినీ అనుమతించొద్దని అధికారులను ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లపై సంతకం చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల సూపరింటెండెంట్లు రంగాప్రసాద్, దారాప్రసాద్ పాల్గొన్నారు.

అపార్‌మైన ఆలస్యం



జగన్నాథపురం హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

- విద్యార్థుల సమగ్ర సమాచారంతో కార్డు..
- 12 అంకెల నంబర్ కేటాయించాలని కేంద్రం నిర్ణయం
- భద్రాద్రి జిల్లాలో 54.58 శాతం నమోదు
- ఖమ్మం జిల్లాలో 33.29 శాతానికే పరిమితం

పాల్వంచరూరల్: విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని ఒకే కార్డు రూపంలో పొందుపరిచి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం అపార్(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు చేపట్టింది. ప్రతీ విద్యార్థికి 12 అంకెల గుర్తింపు నంబర్ కేటాయించి కార్డు అందజేయనున్నారు. ఈ నంబర్ భవిష్యత్‌లో కీలకం కానుంది. దీని ఆధారంగా విద్యార్థుల మెరిట్, విద్యార్హతలు సులభంగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో అపార్ నమోదు ప్రక్రియను గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభించారు. రెండో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2025 జనవరి 31 నమోదుకు తుది గడువుగా నిర్దేశించింది. అయితే జిల్లాలో అపార్ నమోదు ప్రక్రియ అంతంత మాత్రంగానే సాగింది. విద్యాశాఖ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో జిల్లాలో 54.58 శాతం, ఖమ్మం జిల్లాలో 33.29 శాతం మాత్రమే అపార్ వివరాలు నమోదు చేశారు. కాగా గత నెల 31ని గడువుగా ప్రకటించినా, ఆ తర్వాత కూడా నమోదుకు అవకాశం ఇచ్చారని అధికారులు చెబుతున్నారు.

ఆరో స్థానంలో భద్రాద్రి జిల్లా

భద్రాద్రి జిల్లాలో మొత్తం 1,692 పాఠశాలల్లో సుమారు 1,68,439 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 93,065 మంది అపార్ వివరాలు నమోదు చేయగా, ఇంకా 70,942 మంది విద్యార్థుల నమోదు జరగలేదు. మరో నాలుగు పాఠశాలల్లో అపార్ ప్రక్రియే ప్రారంభం కాలేదు. ఖమ్మం జిల్లాలో మొత్తం 1,601 పాఠశాలలు ఉండగా, 2,13,456 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 71,063 నమోదు వివరాలు నమోదు కాగా, ఇంకా 1,42,393 మంది విద్యార్థుల వివరాలు నమోదు చేయాల్సి ఉంది. మరో పది పాఠశాలల్లో అపార్ ప్రక్రియ ప్రారంభంకాలేదు. రాష్ట్రస్థాయిలో కొత్తగూడెం జిల్లా అపార్ నమోదులో ఆరో స్థానంలో నిలవగా, ఖమ్మం జిల్లా మాత్రం 22వ స్థానంలో ఉంది.

ఇవీ ప్రయోజనాలు

అపార్ కార్డుతో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు లభించనున్నాయి. కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తున్న అపార్ కార్డులో విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. ఏ పాఠశాలలో, కళాశాలలో ఎంత వరకు విద్యాభ్యాసం చేశారు? పరీక్షల్లో ఎన్ని మార్కులు సాధించారు? అనే వివరాలు తెలుసుకోవచ్చు. విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు పోగొట్టుకున్నా అపార్ నంబర్ ఆధారంగా వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది.

మండలాల వారీగా అపార్ వివరాలు నమోదు ఇలా..

మండలం	విద్యార్థులు	నమోదు	పెండింగ్	శాతం
చంద్రుగొండ	3,065	2,065	926	67
సుజాతనగర్	2,379	1,615	652	68
పినపాక	4,765	3,189	1,444	67
అశ్వాపురం	3,893	2,581	1,271	66
చుంచుపల్లి	79,52	5,110	2,729	64
ఆళ్లపల్లి	1,944	1,259	658	65
దుమ్ముగూడెం	6,937	3,996	2,785	58
పాల్వంచ	22,615	13,204	8,908	58
బూర్గంపాడు	9,759	5,432	4,026	56
లక్ష్మీదేవిపల్లి	9,738	5,484	3,946	56
టేకులపల్లి	6,330	3,863	2,295	61
ములకలపల్లి	5,031	2,515	2,440	50
మణుగూరు	12,353	6,995	5,168	57
కరకగూడెం	1,413	614	781	43
గుండాల	3,563	1,777	1,653	50
భద్రాచలం	11,707	5,539	5,904	47
అశ్వారావుపేట	8,853	4,389	4,311	50
అన్నపురెడ్డిపల్లి	3,001	1,420	1,484	47
చర్ల	6,110	2,666	3,282	44
కొత్తగూడెం	10,821	7,062	3,201	65
దమ్మపేట	8,437	3,549	4,663	42
ఇల్లెందు	13,784	6,159	7,104	45

ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం..



మిగిలిన జిల్లాలతో పోల్చుకుంటే అపార్ నమోదు ప్రక్రియలో భద్రాద్రి జిల్లా ముందే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఆరో స్థానంలో ఉన్నాం. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులతో పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించడంతో నమోదు ప్రక్రియ వేగంగా సాగింది. కొందరికి ఆధార్ కార్డులు, డేట్ ఆఫ్ బర్త్ పత్రాలు లేని కారణంగా నమోదు సమస్యగా మారింది. ప్రత్యేకంగా దృష్టి సారించి మిగిలిన నమోదును కూడా పూర్తి చేస్తాం. అపార్ కార్డుతో నకిలీ విద్యార్హత పత్రాలను అరికట్టేందుకు అవకాశం ఉంది. –వెంకటేశ్వరాచారి, డీఈఓ

జనరల్ మజ్దూర్లు కాదు.. ఇకపై జనరల్ అసిస్టెంట్లు

సింగరేణి(కొత్తగూడెం)/ఇల్లెందు: సింగరేణిలోని వివిధ విభాగాల్లో జనరల్ మజ్దూర్లుగా పనిచేస్తున్న వారి హోదాను త్వరలోనే జనరల్ అసిస్టెంట్లుగా మార్చనున్నారు. బదిలీ వర్కర్ జనరల్ మజ్దూర్ పేరుతో కొనసాగుతున్న తాము ఏళ్లుగా సామాజిక అసమానతలకు గురవుతున్నామని, అధికారులు సైతం అవమానపరుస్తున్నారని సిబ్బందిలో ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యాన ఈ నెల 6వ తేదీన రాజస్తాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన కోలిండియా రెండో స్టాండరైజేషన్ కమిటీ సమావేశంలో ట్రస్టీ బోర్డు సభ్యుల దృష్టికి తీసుకెళ్లగా జనరల్ మజ్దూర్ల హోదాను జనరల్ అసిస్టెంట్‌గా మార్చడానికి అంగీకరించినట్లు తెలిసింది. ఈ విషయమై కోలిండియా యాజమాన్యం కూడా సానుకూలంగా స్పందించిన నేపథ్యాన త్వరలోనే హోదా మార్పుపై ఉత్తర్వులు జారీ అవుతాయని కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల ఉపాధ్యక్షులు మొగిలిపాక రవి, నాయిని సైదులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

నేడు విష్ణు పారాయణం



కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న దేవనాథ్ జీయర్ స్వామి, నిర్వాహకులు

- వివరాలు వెల్లడించిన దేవనాథ్ జీయర్ స్వామి
- ఇప్పటికే భద్రాచలం చేరుకున్న త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామి

భద్రాచలంటౌన్: ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మంచీ చెడులను ప్రజలకు వివరించి సమ సమాజాన్ని ఏకం చేసేందుకు శనివారం భద్రాచలంలో విరాట్ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీశ్రీ దేవనాథ్ జీయర్ స్వామి తెలిపారు. స్థానిక జీయర్ మఠంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామి శుక్రవారం రాత్రి భద్రాచలం చేరుకున్నారని, శనివారం శ్రీసీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం జీయర్ మఠం విస్తరణ పనులను జీయర్ స్వామి ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం దేవనాథ స్వామి సామూహిక పారాయణం కార్యక్రమం నిర్వహించే క్రీడా మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గట్టు వెంకటాచార్య, చారుగుళ్ల శ్రీనివాస్, తాళ్లపూడి రాము, నాగేశ్వరరావు, రఘు, దేశప్ప, వనజా రామం, లలిత, నర్సింహారావు, వసంతరావు, పుల్లారెడ్డి, పురుషోత్తం, మణి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రం శోభాయాత్ర

శనివారం సాయంత్రం 4 గంటలకు జీయర్ మఠం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు జరిగే శోభాయాత్రలో చిన జీయర్‌స్వామి పాల్గొంటారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సామూహిక విరాట్ విష్ణు సహస్రనామ పారాయణం చేయిస్తారు. భక్తుల కోసం వికాస తరంగిణి కేంద్ర బాధ్యులు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అధికారుల సహకారంతో రెండు చోట్ల ప్రాథమిక చికిత్సా కేంద్రాలు, పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోకి ప్రవేశించే మార్గాల్లో స్వామి ఫొటోలతో స్వాగత తోరణాలు ఏర్పాటుచేశారు. భీష్మ ఏకాదశి సందర్భంగా విరాట్ శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం నిర్వహించనున్నట్లు కమిటీ బాధ్యులు తెలిపారు. భద్రాచలంతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు 20 వేల మంది వరకు హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేశారు.

స్కానింగ్ సెంటర్లలో ఆడిట్ నిర్వహించాలి

కొత్తగూడెంఅర్బన్: స్కానింగ్ సెంటర్లలో ప్రతి నెలా 10 ఫార్మ్–ఎఫ్ ఆడిట్ నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్ సూచించారు. శుక్రవారం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన పీసీపీఎన్‌డీటీ జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో హెల్త్ ఎడ్యుకేటర్ల ద్వారా ఆడిట్ నిర్వహించాలని చెప్పారు. అందరికీ పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఫైయాజుద్దీన్, అస్గర్ హుస్సేన్, డాక్టర్ అనుషలక్ష్మి పాల్గొన్నారు.

వంద శాతం వసూలు చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో ఇంటి పన్నులు, పంపు బిల్లులు వంద శాతం వసూలు చేయాలని మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మొండి బకాయిలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, మేనేజర్ ప్రసాద్, రెవెన్యూ ఆఫీసర్ రవీందర్, డీఈ రవికుమార్, ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అతివలకు ఆదరువుగా..

లక్ష్యానికి మించి రుణాల మంజూరు

- రికవరీ జిల్లాలో 92శాతం వరకు పూర్తి
- 1,200 కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రణాళిక
- పట్టణాల్లో ఫుడ్‌కోర్ట్‌ల ఏర్పాటుతో ముందుకు



సమావేశంలో పాల్గొన్న మహిళా సంఘం సభ్యులు(ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతూ అమలు చేస్తోంది. అందులో భాగంగా మున్సిపాలిటీలలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ–మెప్మా సంయుక్త ఆధ్వర్యాన మహిళలకు రుణాలు మంజూరు చేస్తోంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో (2024–25) జిల్లా కేంద్రం కొత్తగూడెంతో పాటుగా మిగతా మున్సిపాలిటీల్లోనూ మహిళా సంఘాలకు ఫుడ్‌కోర్ట్‌లు ఏర్పాటు చేయించి, చిరువ్యాపారాలు చేయించేలా ప్రోత్సహిస్తున్నారు.

పురుషులతో సమానంగా..

పురుషులతో సమానంగా మెప్మాలోని మహిళా సభ్యులకు ఫుడ్‌కోర్ట్‌ల ద్వారా వ్యాపారం చేసే అవకాశం లభించింది. దీంతో వారికి ఇంట్లో గౌరవం పెరగడంతో పాటు రోజుకు ఎంతోకొంత డబ్బులను సంపాదిస్తూ వారి కుటుంబాలకు ఆదరువుగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తగూడెం మున్సిపాలిటీలో జిల్లా ప్రభుత్వాస్పత్రి పక్కన ఫుడ్‌కోర్ట్‌లో 22 షాపులు, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మరో రెండు ఏర్పాటు చేయించారు. దీంతోపాటు ఎక్కువ జనాభా గల ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాగా, ప్రస్తుతం సోలార్ ఎనర్జీని వినియోగించుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తుండడంతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు, దానికి కావాల్సిన పరికరాల అమ్మకాలపై ప్రభుత్వం దృష్టి సారించి మెప్మా సంఘం సభ్యులకు సోలార్ ప్లాంట్ల బాధ్యత అప్పగించింది. దీంతో మెప్మా బాధ్యులు వాటి నిర్వహణపై కార్యాచరణ రూపొందించేలా చర్యలు చేపట్టారు.

సాంకేతిక సమస్యలతో ఆటంకం..

మెప్మా రుణాలతో పాటు సంఘంలోని సభ్యులకు స్త్రీనిధి రుణాలనూ ఇప్పించి చిరు వ్యాపారాలను చేయిస్తున్నారు. పట్టణాల్లో వీధి వ్యాపారులకు రూ.10వేల నుంచి రూ.50 వేల వరకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి వ్యాపారాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. అయితే సాంకేతిక సమస్యలతో ప్రస్తుతం వీధి వ్యాపారుల రుణాల కోసం దరఖాస్తులు, కొత్త రుణాలు, రుణాల అప్‌గ్రేడ్ వంటివి చేసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో లబ్ధిదారులు, అర్హత ఉన్న వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు సాంకేతిక లోపాలను సరిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మెప్మా రుణాల వివరాలు ఇలా...

మున్సిపాలిటీ	గ్రూప్‌లు	లక్ష్యం (రూ.లక్షల్లో)	మంజూరు (రూ.లక్షల్లో)
కొత్తగూడెం	124	1,091.6	1,552.11
మణుగూరు	86	532.8	651.2
పాల్వంచ	116	703.1	2,711.25
ఇల్లెందు	95	798	935.25
మొత్తం	421	3,125.5	5,849.81

జిల్లాలో 1,200 నూతన సంఘాలు

జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీల్లో మొత్తం 3,249 మెప్మా సంఘాలు ఉండగా.. ఇందులో 32,690 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాలనుసారం జిల్లాలో మరో 1,200 నూతన మెప్మా సంఘాలను ఏర్పాటు చేసేందుకు మెప్మా అధికారులు ప్రణాళిక చేస్తున్నారు. ఈనేపథ్యాన రేషన్ కార్డుల ఆధారంగా మహిళల జాబితాను సేకరించి అర్హులైన వారిలో గ్రూపుకు 10 మంది చొప్పున కేటాయించి మెప్మా రుణాలు ఇప్పించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

లక్ష్యానికి మించి రుణాలు..



మెప్మా సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా బలోపేతం చేయాలని ఆయా మున్సిపాలిటీల్లో ఫుడ్‌కోర్ట్‌లు ఏర్పాటు చేయిస్తున్నాం. దీంతో మహిళలకు ఉపాధి దొరకడంతో పాటు మరిన్ని పథకాల్లోనూ వారు భాగస్వామ్యం కానున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఇప్పటివరకు టార్గెట్‌కు మించి రుణాలు ఇచ్చాం. అదే రీతిలో వారు కూడా బ్యాంకులకు చెల్లింపులు చేస్తున్నారు.

– రాజేష్, జిల్లా మిషన్ కోఆర్డినేటర్

క్లుప్తంగా

లండన్ అబ్బాయి... పాల్వంచ అమ్మాయి !

ప్రేమ బంధంతో ఒక్కటైన జంట



నియాల్ - షహనాజ్‌తో బంధువులు

పాల్వంచ: ఆ యువతీ, యువకుడి ప్రేమకు దేశాలు, మతాలు అడ్డురాలేదు. ఇరువైపులా పెద్దలను ఒప్పించి మరీ వివాహబంధంతో వారిద్దరు ఒక్కటయ్యారు. పట్టణంలోని ఒడ్డుగూడేనికి చెందిన షేక్ మౌలా సాహేబ్ –ఖాజాబీ కుమార్తె షేక్ షహనాజ్ ఉన్నత చదువుల నిమిత్తం లండన్ వెళ్లింది. అక్కడ నియాల్ హట్టన్‌తో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. దీంతో ఇద్దరు వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని పెద్దలకు చెప్పారు. ఇరు కుటుంబాలు అంగీకరించడంతో పాల్వంచలో శుక్రవారం వివాహ వేడుక నిర్వహించారు. కాగా, ఈ వివాహానికి నియాల్ హట్టన్ కుటుంబీకులు, బంధువులు పలువురు హాజరవడంతో సందడి నెలకొంది.

పర్యావరణానికి హాని కల్గించొద్దు..



గెలుపొందిన క్రీడాకారులతో డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్

టేకులపల్లి: అడవికి నిప్పు పెట్టి పర్యావరణానికి హాని కలిగించొద్దని, అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని డీఎఫ్‌ఓ జి.కృష్ణగౌడ్ అన్నారు. టేకులపల్లి మండలం బర్లగూడెం గ్రామంలో గత రెండు రోజుల పాటు నిర్వహించిన ఫైర్ అవేర్‌నెస్, ఫైర్ ఫైటర్స్ వాలీబాల్ కప్ పోటీలు శుక్రవారం ముగియగా.. ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. అడవులను అగ్ని ప్రమాదాల నుంచి కాపాడాలని, వన్యప్రాణులను రక్షించాలని, వన్యప్రాణులను వేటాడటం చట్ట ప్రకారం నేరమన్నారు. అనంతరం వాలీబాల్ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎఫ్ కోటేశ్వర్‌రావు, డిప్యూటీ సీఎఫ్‌ఎఫ్‌డీలో కె.దామోదర్‌రెడ్డి, ఎఫ్ఆర్‌ఓ ముఖ్తార్‌హుస్సేన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ టోర్నీ..



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని హనుమాన్‌బస్తీలో గల బ్యాడ్మింటన్ ఇండోర్‌లో స్టేడియంలో ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ కోచ్ గుజ్జుల సుధాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం సుధాకర్‌రెడ్డి మెమోరియల్ పేరిట నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ శుక్రవారం రెండు రోజుకు చేరుకుంది. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. మహిళలు, పురుషుల విభాగంలో ఈ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ కె.సావిత్రి, ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ యుగేంధర్‌రెడ్డి, సెక్రటరీ ఆర్.రాజేందర్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇంటూరి రవికుమార్, ట్రెజరర్ కె.రమేష్, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, గిరి పాల్గొన్నారు.

ముందస్తు బెయిల్‌కు హైకోర్టు నిరాకరణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన ఓ యువతిని స్థానిక మెడికల్ కాలనీకి చెందిన భరణి వెంకటకార్తీక్ అనే యువ న్యాయవాది పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా వాడుకుని, గర్భవతి అని తెలిసి దూరం పెట్టాడు. దీంతో బాధితురాలు పెద్ద మనుషులను, పోలీసులను ఆశ్రయించగా.. వారి సమక్షంలో పెళ్లికి అంగీకరించి, మరుసటి రోజు నుంచి నిరాకరిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీన సదరు యువతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కార్తీక్‌పై ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. దీంతో కార్తీక్ పరారీలో ఉండగా.. ముందస్తు బెయిల్ కోసం ఈ నెల 6న కార్తీక్ తరఫు న్యాయవాది క్రిష్ణ కిషోర్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం హైకోర్టు న్యాయమూర్తి చాడ విజయభాస్కర్‌రెడ్డి వద్ద ముద్దాయి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఆతర్వాత ముద్దాయిపై నమోదైన కేసుకు ముందస్తు బెయిల్ ఇవ్వడం కుదరదని పిటిషన్‌ను డిస్మిస్ చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

ఏరియా ఆస్పత్రిలో వసూళ్లపై విచారణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ప్రసవం కోసం వచ్చిన ఓ గర్భిణి ఆస్పత్రి సిబ్బందితో తాను ఎదుర్కొన్న సమస్యలపై వాట్సాప్‌లో పోస్ట్ చేసిన ఓ వీడియో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. మణుగూరు మండలానికి చెందిన ఓ గర్భిణి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి రాగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆమెతో ప్రవర్తించిన తీరు, ప్రసవ సమయాన ప్రతి చిన్న పనికి కూడా లంచం ఇవ్వాలిందేనని, లేకపోతే సదరు సిబ్బంది రోగుల పట్ల వ్యవహార శైలీలో మార్పు ఉంటుందంటూ గురువారం వాట్సాప్‌లో ఓ వీడియో పోస్ట్ చేసింది. ఈ వీడియో కాస్తా వైరల్‌గా మారి జిల్లా వైద్యాధికారులు వద్దకు చేరింది. దీంతో స్పందించిన వైద్యాధికారులు వెంటనే విచారణ చేపట్టాలని బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావును ఆదేశాలు జారీ చేయడంతో శుక్రవారం ఆయన ఏరియా ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. ప్రసవ విభాగాల్లోని సిబ్బందిని, రోగులను విచారించి సమాచారాన్ని సేకరించారు. కాగా, ఇదే విషయమై వివరణ కోరగా.. విచారణ పూర్తయిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ముక్కంటేశ్వరరావు తెలిపారు.

ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన నాయకులు

ఎమ్మెల్సీ తాతా మధు

కారేపల్లి: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ విస్మరించిందని.. దీంతో ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌రావు అన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వాసి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వాంకుడోతు జగన్‌ను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎవరూ అడగకపోయిన పేదిళ్లలో ఆడబిడ్డల పెళ్లికి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా రూ.లక్ష సాయం అందించేవారని.. కాంగ్రెస్ మాత్రం రూ.లక్షకు తోడు తులం బంగారం ఇస్తామన్న హామీని విస్మరించిందని ఆరోపించారు. ఈసమావేశంలో నాయకులు ముత్యాల సత్యనారాయణ, ఉన్నం వీరేందర్, రావూరి శ్రీనివాసరావు, ధరావత్ మంగీలాల్, ముత్యాల వెంకటప్పారావు, అడపా పుల్లారావు, బానోతు కుమార్ పాల్గొన్నారు.

ఇసుక క్వారీ సర్వే అడ్డగింత

చర్ల: మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీలో ఇసుక క్వారీ ఏర్పాటుకు సంబంధించి రెవెన్యూ, మైనింగ్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించేందుకు రాగా శుక్రవారం అక్కడి గిరిజనులు అడ్డుకున్నారు. ఇసుక క్వారీ ఏర్పాటుపై నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేయడంతో అధికారులు సర్వే కోసం అక్కడకు వచ్చారు. అయితే గ్రామ పంచాయతీ పరిధిలో రెండు గిరిజన మహిళా సొసైటీలు ఉండగా.. ఈ రెండింటికి కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. గతంలోనూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించేందుకు రాగా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయమై చర్ల తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. గ్రామ పంచాయతీలో ఏర్పాటైన రెండు సొసైటీలకు సంబంధించి ఒక్కసారే సర్వే చేయాలని లేకుంటే రెండూ నిలుపుదల చేయాలని గిరిజనులు పట్టుబట్టడంతో సర్వేను నిలిపివేసినట్లు ఆయన తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

దమ్మపేట: మద్యంమత్తులో పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని అంకంపాలెం గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన కాకాడి బాబురావు (32) గురువారం మద్యంమత్తులో ఉండగా.. జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడికి ప్రాథమిక చికిత్స అందించి ఖమ్మంకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

నలుగురు మావోయిస్టు పార్టీ సభ్యుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజువర్మ

చర్ల: మావోయిస్టు పార్టీకి చెందిన ఒక ఏరియా కమిటీ సభ్యుడితో పాటు ముగ్గురు మిలీషియా సభ్యులను చర్ల పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ ఎ.రాజువర్మ వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం చర్ల సివిల్, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్, 81 బెటాలియన్లకు చెందిన పోలీసులు తాలిపేరు ప్రాజెక్టు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యాన అటుగా వస్తున్న నలుగురు వ్యక్తులను ఆపి ప్రశ్నించే క్రమంలో పారిపోయేందుకు యత్నించగా.. వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో తామంతా మావోయిస్టు పార్టీలో పని చేస్తున్నట్లు అంగీకరించారు. వీరిలో బీజాపూర్ జిల్లా పోలంపల్లి గ్రామానికి చెందిన ఏరియా కమిటీ సభ్యుడు గట్టుపల్లి ఊర అలియాస్ సోమన్న, సుకుమా జిల్లా చింతల్‌నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మొరేపాల్ గ్రామానికి చెందిన జేగురుగొండ ఏరియా కమిటీ పార్టీ సభ్యుడు మడకం ఉంగ, దంతెవాడ జిల్లా అల్నార్ గ్రామానికి చెందిన జేగురుగొండ ఏరియా కమిటీ పార్టీ సభ్యుడు కడితి లక్రే అలియాస్ మంజు, సుకుమా జిల్లా గొండపల్లి గ్రామానికి చెందిన పామేడు ఏరియా కమిటీ పార్టీ సభ్యుడు సోడి సుక్కీ అలియాస్‌లు కాగా.. వారి వద్ద నుంచి పార్టీకి చెందిన 30 కరపత్రాలను స్వాధీనం చేసుకు కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, 81 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ అనీల్, చర్ల ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

కామేపల్లి: మండలంలోని పండితాపురానికి చెందిన యర్రనాగుల వెంకటేశ్వర్లుకు చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఆయన శుక్రవారం తన ఇంటి ముందు బైక్‌ను పార్క్ చేసి కాసేపటికి చూడగా కనిపించలేదు. దీంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఐటీసీ కార్మికుడికి తీవ్రగాయాలు

బూర్గంపాడు: రోడ్డుపై నిలిపిన కర్రలోడ్ ట్రాక్టర్ ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఐటీసీ పర్మినెంట్ కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. బూర్గంపాడుకు చెందిన షేక్ అక్తర్ ఐటీసీలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీలాగే గురువారం రాత్రి విధులకు తన మోటార్ సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో పాతగొమ్మూరు వద్ద కర్ర లోడ్‌తో రోడ్డుపై నిలిపిన ట్రాక్టర్ ట్రక్కును వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌కు ట్రక్కు సరిగా కనిపించకపోవడంతో ఢీకొట్టగా తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతడిని 108లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి, అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

బూర్గంపాడు: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తాటి విజయరాంబాబు(31) ఈ నెల 3వ తేదీన ముసలిమడుగు గ్రామంలోని బంధువుల ఇంటికి మోటార్‌సైకిల్‌పై వచ్చాడు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో సంజీరెడ్డిపాలెం వద్ద ఎదురుగా వస్తున్న మరో మోటార్‌సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిద్దరిని భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం విజయరాంబాబును ఖమ్మంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కాగా, ప్రమాదంలో గాయపడిన మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన మరో మోటార్‌సైకిలిస్ట్ వెలగపూడి భాస్కర్‌రెడ్డి భద్రాచలంలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షుద్రపూజల కలకలం



పాఠశాల ఆవరణలో క్షుద్ర పూజలు

గుండాల: మర్కోడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో క్షుద్ర పూజల ఆనవాళ్లు కలకలం రేపాయి. ఆళ్లపల్లి మండలం మర్కోడు ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చినట్లు తెలిసింది. ఉదయంకల్లా పాఠశాల ఆవరణలో నిమ్మకాయ, కుంకుమ, పసుపు, మిరపకాయ తదితరాలతో పూజలు చేసినట్టు కనిపించింది. పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు వీటిని చూసి భయాందోళనకు గురయ్యారు. మర్కోడు ప్రధాన సెంటర్‌లో ఉండే ఈ పాఠశాలలో ఇలాంటి పనులకు పాల్పడిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాటుసారాయి స్థావరంపై దాడి..

ఇద్దరిపై కేసు నమోదు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: నాటుసారాయి తయారు చేసే ఇద్దరిపై కేసు నమోదైంది. శుక్రవారం కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో జరిగిన సమావేశంలో హౌస్ ఆఫీసర్ జయశ్రీ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య ఆదేశాల మేరకు చుంచుపల్లి మండలంలోని చుంచుపల్లితండా, రుద్రంపూర్, సుజాతనగర్ మండలంలోని సర్వారం, గుడితండా, జామ్లతండా, కోమటిపల్లి గ్రామాల్లో కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈక్రమంలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నాలుగు లీటర్ల గుడంబాను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక 350 లీటర్ల నాటు సారాయి తయారీకి వాడే బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి వారిరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

బాలుడి మర్మాంగాన్ని కొరికిన పెంపుడు కుక్క

భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స



లక్ష్మయ్యకు ఆపరేషన్ చేస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ

భద్రాచలంఅర్బన్: నిద్రిస్తున్న బాలుడి మర్మాంగాన్ని పెంపుడు కుక్క కొరికిన ఘటన ఇది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కుంట గ్రామంలో జరిగిన ఈ ఘటనలో బాలుడికి తీవ్ర రక్తస్రావం కాగా భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేశారు. కుంట గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలుడు వెట్టి లక్ష్మయ్య గురువారం సాయంత్రం దాటాక ఇంట్లో నిద్రిస్తుండగా వారు పెంచుకునే కుక్క మర్మాంగాన్ని కొరికింది. దీంతో మేల్కొన్న ఆయన తీవ్రంగా రోదిస్తుండగా కుటుంబీకులు స్థానికంగా చికిత్స చేయించినా రక్తస్రావం ఆగలేదు. ఈమేరకు శుక్రవారం బాలుడిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడి మర్మాంగానికి శస్త్రచికిత్స చేశారు. లక్ష్మయ్యకు అన్ని పరీక్షలు నిర్వహించామని, వ్యాక్సిన్లు కూడా వేశామని.. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ తెలిపారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడిన వ్యక్తి..

దుమ్ముగూడెం : మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన షేక్ మైదీన్ (40) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మైదీన్ ఈ నెల 2న రాత్రి భద్రాచలం నుంచి నరసాపురంలోని తన ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో తూరుబాక కుంగిన కల్వర్టు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగిన బాలిక..

దుమ్ముగూడెం: చదువుకోమని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ మైనర్ బాలిక పురుగుల మందు తాగగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ధర్మారం కొత్తగూడెం గ్రామానికి తునికి లక్ష్మి, జోగారావు దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందులో రెండో కూతురైన దివ్యశ్రీ (16) 9వ తరగతి వరకు చదివి చదువు మానేసి ఇంట్లోనే ఉంటుంది. ఈక్రమంలో దివ్యశ్రీ తల్లిదండ్రులు మిగతా పిల్లల లాగా చదువుకోవచ్చుకదా అని తరచూ మందలిస్తుండడంతో పాటు పొలం పనులకు రమ్మని చెప్పినా వెళ్లేది కాదు. ఈ క్రమంలో గత నెల 26న ఆమె తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో నోటి నుంచి నురగతో పడి ఉన్న దివ్యశ్రీని పరిశీలించగా పురుగుల మందు వాసన రావడంతో భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి ఈనెల 6న రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాంబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘ఉపాధి’ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



నాగరాజు (ఫైల్)

ములకలపల్లి: మండలపరిధిలోని గడ్డంవారిగుంపు గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ) గడ్డం నాగరాజు (33) అనారోగ్యంతో మృతిచెందారు. మూకమామిడి, చౌటిగూడెం జీపీల పరిధిలో ఎఫ్ఏగా విధులు నిర్వహిస్తున్న ఆయన అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కొత్తగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించి గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారి, ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు.

టిప్పర్ లారీ బోల్తా

మధిర: మధిరలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం టిప్పర్ లారీ బోల్తా పడింది. రైల్వే మూడో లైన్ నిర్మాణ పనులకు మట్టి తీసుకొస్తున్న టిప్పర్ బ్రిడ్జి వద్ద భగీరథ పైప్‌లైన్ మరమ్మతులకు తవ్విన గోతిలో పడడంతో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.